అమరజీవి త్యాగం చిరస్మరణీయం



జిల్లా పోలీస్ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న చక్రధర్‌బాబు, ద్వారకానాథ్, తదితరులు



జిల్లా కోర్టు భవనంలో..

నెల్లూరు(క్రైమ్): రాష్ట్రావతరణ కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ, పోలీస్ అధికారులు గురువారం నివాళులర్పించారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఓ విజయ్‌కుమార్, ఏఆర్, హోంగార్డ్స్ డీఎస్పీలు గాంధీ, చంద్రమోహన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఆర్‌ఐలు అంకమరావు, మౌలుద్దీన్, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బొబ్బల శ్రీనివాస యాదవ్, అవినాష్, చంద్రశేఖర్, ఏసునాయుడు, పరమేశ్వరరెడ్డి, హరిబాబు, పవన్‌కుమార్‌రెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కమిషనర్ హరిత పాల్గొన్నారు.

- పొట్టి శ్రీరాములును నిత్యం గుర్తించుకునేలా కార్యక్రమాలను చేపడుతూ.. అమరజీవి ఆశయ సాధన కోసం సాగుతున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ కొనియాడారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవంబర్ ఒకటిన రాష్ట్రావతరణ ఉండాలనే ఉద్దేశంతో జీఓను సీఎం విడుదల చేశారని పేర్కొన్నారు. నేతలు సీతారామారావు, పద్మప్రియ, సుప్రియ, జ్యోతిప్రసాద్, పార్థసారథి, శ్రీరామ్ సురేష్, రమేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.
- అమరావతిలో గాంధీ స్మృతివనం పక్కన పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు చలమయ్య కోరారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్య వైశ్య సంఘ నేతలు రవీంద్ర, నాగేశ్వరరావు, శరత్, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డిప్యూటీ ఈఓ భిక్షాలు, ఏఎంఓ సుధీర్‌బాబు, ప్లానింగ్ కోఆర్డినేటర్ బాలకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నెల్లూరు(లీగల్): జిల్లా కోర్టు భవనంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి, ఏపీపీలు రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీ అన్వర్‌బాషా, కృష్ణ, కోటేశ్వరరావు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. సెట్నెల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో..



సమగ్రశిక్ష కార్యాలయంలో..



ఆర్డీఓ కార్యాలయంలో..



జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో..



జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో..

క్లుప్తంగా

గోదాములో తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక పౌరసరఫరాలశాఖ గోదామును జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ పరంగా జిల్లాలో అక్కడక్కడా కొన్ని ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేవని, అన్నీ రికార్డుల మేరకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాలశాఖకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ ఇబ్రహీం, డిప్యూటీ తహసీల్దార్ మురళి ఉన్నారు.

గుండాలమ్మపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'



కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెం ఎస్సీకాలనీలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు, హెచ్‌ఎస్ ఎన్.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ షేక్ రషీద, హెచ్‌ఏలు ఎస్‌కే షఫీఉద్దీన్, బి.విజయలక్ష్మి, ఆశా కార్యకర్త పి.శైలజ పాల్గొన్నారు.

కాటాలకు అనుమతులు తప్పనిసరి



బుచ్చిరెడ్డిపాళెం: వివిధ దుకాణాలు, చేపలు, మాంసం మార్కెట్లు, పండ్లు దుకాణాల్లో ఉన్న కాటాలకు అనుమతులు తప్పనిసరి అని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పలు దుకాణాల్లో కాటాలకు గురువారం ముద్రలు వేయడంతోపాటు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వివిధ దుకాణాలు, మాంసం, చేపల మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలు, రాళ్లు, కాటాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. దీంతో ఇటీవల దాడులు చేసి 20 కాటాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కాటాలు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వద్ద శాఖాపరమైన ముద్రలు వేయించుకుని, ధ్రువీకరణ పత్రాలు పొందాలని తెలిపారు. రాళ్ల కాటాలకు ఈ ధ్రువీకరణ పత్రం రెండు సంవత్సరాల వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. కాటాలకు ముద్రలు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలుదారులు కూడా కాటాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు మొత్తం 174 మంది విద్యార్థులకు గాను, 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

20 మంది విద్యార్థుల గైర్హాజరు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 487 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా అందులో 20 మంది హాజరుకాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ బోల్తాపడి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన మున్వర్‌బాషా పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు పంచాయతీ చింతలపాళెం వద్ద గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మున్వర్‌బాషాకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఢిల్లీలో సీబీఐపీ అవార్డును ఇటీవల అందుకున్న తెలుగుగంగ ఎస్ఈ, సీఈ హరినారాయణరెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో గల ఎస్సెస్సెల్సీ అండ్ ఎస్సీ ప్రాంగణంలో పలువురు ఉద్యోగులు గురువారం సత్కరించారు. హరినారాయణ ఆధ్వర్యంలో మరిన్ని అవార్డులు జిల్లాకు రావాలని కాంక్షించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పెద్దాస్పత్రికి వైద్య పరికరాల వితరణ



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని పెద్దాస్పత్రిలో సెలైన్లను ఏర్పాటు చేసుకునేందుకు గానూ పలు స్టాండ్లను ప్రియదర్శిని మహిళా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్ లక్ష్మీసునంద మాట్లాడారు. పెద్దాస్పత్రికి బీపీ ఆపరేటర్లు, స్ట్రెచ్చర్లు, వీల్ చైర్లు, తదితర పరికరాలను ప్రియదర్శిని మహిళా లయన్స్ క్లబ్ సభ్యులు ఇప్పటికే అందజేశారని కొనియాడారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అఖిలారెడ్డి, ఆస్పత్రి ఆర్ఎంఓ కళారాణి, డాక్టర్లు సుబ్రహ్మణ్యం, అరుణ్‌కాంత్, సతీష్, సుశీల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్షను విడనాడాలి



నెల్లూరు(బృందావనం): మహిళలపై వివక్షను విడనాడాలని ఏపీఐడీసీ డైరెక్టర్ మమతారెడ్డి పేర్కొన్నారు. పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సును క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం పలు ట్రస్ట్‌ల నిర్వాహకులు కల్యాణి, జయప్రద, దాతలు విజయలక్ష్మి, కామాక్షమ్మ, తదితరులను సత్కరించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలకు అన్నదానం నిర్వహించి దుప్పట్లు, తదితరాలను పంపిణీ చేశారు. కుసుమకుమారి, మాధవి, పద్మమ్మ, వీఆర్వో గీతాంజలి, సౌజన్య, గోపీనాథ్‌రెడ్డి, శారద దంపతులు, రాధాకృష్ణ, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీఏఐ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



బాధ్యతలు స్వీకరిస్తున్న హరిశంకర్

నెల్లూరు(బారకాసు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను నగరంలోని ఐసీఏఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీఏఐ మాజీ అధ్యక్షుడు దేవరాజురెడ్డి హాజరయ్యారు. ఐసీఏఐ జిల్లా చైర్మన్‌గా హరిశంకర్, వైస్ చైర్మన్‌గా యువరాజేష్, సెక్రటరీగా సుధామహేష్, ట్రెజరర్‌గా బాలకోటి బులు, విద్యార్థి విభాగ చైర్మన్‌గా అరుణ్‌కుమార్, మెంబర్‌గా వెంకటమాధురి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యాపిల్ వాచ్ విషయమై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన వారిపై బాలాజీనగర్ పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇస్కాన్ సిటీలోని ఇందిరానగర్‌కు చెందిన బిల్డర్ వెంకటకృష్ణ, వెంకట్రామపురానికి చెందిన ప్రసాద్‌నాయుడు స్నేహితులు. వెంకటకృష్ణ చేతికున్న యాపిల్ వాచ్‌ను చూసిస్తానని ప్రసాద్‌నాయుడు ఇటీవల తీసుకున్నారు. వాచ్ విషయాన్ని మరిచిన వెంకటకృష్ణ ఇంటికెళ్లిపోయారు. ఈ విషయమై ప్రసాద్‌నాయుడికి ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో స్నేహితుడి ఇంటి వద్దకు వెంకటకృష్ణ మంగళవారం రాత్రి వెళ్లారు. వాచ్ విషయమై ప్రశ్నించగా, ప్రసాద్‌నాయుడు, హనుమంతరావు, కార్తీక్‌రెడ్డి, తదితరులు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మహబూబ్ సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ - 98 క్వాలిఫైడ్స్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తూ జీఓ నంబర్ 27 ద్వారా ఉత్తర్వులను జారీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి డీఎస్సీ - 98 క్వాలిఫైడ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ జీఓ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4534 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమితులు కానున్నారని చెప్పారు. సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

రూరల్ తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యం

నెల్లూరు (అర్బన్): నెల్లూరు రూరల్ తహసీల్దార్‌గా సుబ్రహ్మణ్యాన్ని నియమిస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. తిరుపతి జిల్లాలోని కలెక్టరేట్లో ప్రస్తుతం ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. నెల్లూరు కలెక్టరేట్లో ఏడాగా గతంలో ఆయన పనిచేశారు.

జీజీహెచ్‌లో తొలిసారిగా న్యూరాలజీ వైద్యం

- ప్రతి గురువారం ఓపీ సేవలు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో న్యూరాలజీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని న్యూరాలజిస్ట్ ఫణికుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. తాను ఎండీ, డీఎం (న్యూరాలజీ) చేసి తిరుపతిలోని స్విమ్స్ వైద్యశాలలో సేవలందించానని తెలిపారు. స్వస్థలం నెల్లూరుని చెప్పారు. తలనొప్పి (మైగ్రేన్), పక్షవాతం, వెన్నుపూస సమస్యలు, స్పాండిలోసిస్ (సర్వికల్ అండ్ లంబార్), మూర్ఛ, వణుకుడు, మతిమరుపు, న్యూరోపతిక్, మెదడులో ట్యూమర్లు, తదితర అన్ని రకాల నరాల జబ్బులకు వైద్యాన్ని అందించనున్నామని వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రతి గురువారం ఓపీ సేవలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే వారంలో రెండు రోజులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. పెద్దాస్పత్రిలో ఉచితంగా అందే సూపర్ స్పెషాల్టీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్యశాఖకు విద్యుత్ అధికారుల నోటీసులు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులను గురువారం జారీ చేశారు. ఆ శాఖకు చెందిన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ పెంచలయ్యకు నోటీసులను అందజేశారు. సుమారు రూ.5.5 కోట్ల బకాయిలు ఉన్నాయని వివరించారు. దీంతో స్పందించిన డీఎంహెచ్ఓ అనేక సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రాలు), ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి తమ పరిధిలో లేవని, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయని తెలిపారు.

వీటిని వేరు చేసి జిల్లాలోని పీహెచ్‌సీలు, జిల్లా వైద్యశాఖ, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన బిల్లులు వివరాలను మాత్రమే తమకు అందజేయాలని పేర్కొన్నారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు తాము సర్వీస్ నంబర్ల ఆధారంగా విభజన చేసి బిల్లులను అందజేస్తామని తెలిపారు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ప్రదానం



మహబూబ్‌బాషా

నెల్లూరు (టౌన్): విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషాకు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌లో డిజైనింగ్ ఆఫ్ మెషీన్ లెర్నింగ్ అండ్ బయోమెడికల్ ఇమేజ్ అనాలసిస్ పైప్‌లైన్స్ ఫర్ హెల్త్ కేర్ రీసెర్చ్ ఇంక్లూడింగ్ కోవిడ్ - 19 అనే అంశంపై పరిశోధన చేసినందుకు గానూ బ్రెజిల్‌లోని ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ ఆఫ్ సియారా వారు అవార్డును ప్రదానం చేశారు. వివిధ రకాల ఎక్స్‌రే ఇమేజెస్‌పై పరిశోధనకు సంబంధించిన పత్రాలు ఇంటర్నేషనల్ జర్నల్స్ జాన్ విల్లీస్, ఎల్సేవిర్‌లో ప్రచురితమయ్యాయి. కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి హరినాథ్‌రెడ్డి అభినందించారు.

ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు



సునీల్ గార్గెన్ గాత్ర కచేరి



మహావిష్ణువు అలంకారంలో త్యాగరాజస్వామి

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. మహావిష్ణువు అలంకారంలో స్వామివారు కొలువై భక్తులను కటాక్షించారు. చెన్నైకి చెందిన ప్రముఖ విద్వాంసుడు సునీల్ గార్గెన్ తన సుమధుర గాత్రంతో అలరించారు. లక్ష్మీభట్, విజయగణేషన్ (వయోలిన్), శ్రీరామ్ (మృదంగం), సాయినాథ్ (ఘటం) వాద్య సహకారం అందించారు. కథకులు భవానీబాయి భాగవతారిణితో ద్రౌపది స్వయంవరం, నాగమణి భాగవతారిణి కృష్ణరాయబార హరికథా గానం చేశారు. అనంతరం ఔత్సాహిక కళాకారులతో గాత్ర, వీణ కచేరీలను జరిపారు. కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, నాగదేవీప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ





జఠిలంగా ట్రాఫిక్

- రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్న వైనం
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

నెల్లూరు(క్రైమ్): ఏసీ కూరగాయల మార్కెట్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులతో పాటు ప్రజలు కూరగాయల కొనుగోలు నిమిత్తం పెద్ద ఎత్తున మార్కెట్‌కు వస్తారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం వాటిల్లుతోంది. ఫలితంగా ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. ఇటీవలి కాలంలో సమస్య మరింత తీవ్రంగా మారింది. కొందరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు మార్కెట్ వద్ద గల ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారు. నడిరోడ్డుపైనే తోపుడు బండ్లను పెట్టుకొని వ్యాపారాలను సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనదారులు సైతం నడిరోడ్లపైనే వాహనాలను నిలిపి పండ్లు, కూరగాయలు, తదితరాలను కొనుగోలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

తోపుడు బండ్లను రోడ్డుపై నుంచి తొలగించి సచివాలయం పక్కనే అనుబంధంగా ఉన్న కూరగాయల మార్కెట్ లోపల పెట్టుకుంటే ట్రాఫిక్ ఇబ్బందులు తీరే అవకాశం ఉంది. ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర వాసులు పేర్కొంటున్నారు.

డీపీఓలో హెడ్ కానిస్టేబుల్ వీరంగం

నెల్లూరు(క్రైమ్): మినిస్టీరియల్ సిబ్బందిపై మద్యం మత్తులో ఓ హెడ్ కానిస్టేబుల్ వీరంగం చేసిన ఘటన జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జేమ్స్ మద్యం మత్తులో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. తన ప్రమోషన్, ఇంక్రిమెంట్ల విషయమై అక్కడి మినిస్టీరియల్ సిబ్బందితో గొడవపడ్డారు. దీంతో బాధిత సిబ్బంది జరిగిన విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు దర్గామిట్ట పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.